క్లుప్తంగా

ఆకట్టుకున్న విద్యార్థుల మాక్‌పోలింగ్



కోస్గి: మండలంలోని ముశ్రీఫా జెడ్పీ ఉన్నతపాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన మాక్‌పోలింగ్ ఆకట్టుకుంది. నిజమైన ఎన్నికల్ని తలపించేలా పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచారం చేయగా ముద్రించిన బ్యాలెట్‌లో ఓటింగ్ నిర్వహించారు. ఇందులో ఓటింగ్ స్లిప్పుల పంపిణీ, ఎన్నికల నిర్వహణ అధికారులు, రహస్య ఓటింగ్, కౌటింగ్ నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక



మాగనూర్: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు మంగళవారం ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల నూతన అధ్యక్షుడిగా గజ్జపతి, కో–ఇన్‌చార్జిగా దీనేష్, సభ్యులుగా లక్ష్మణ్, కీర్లింగప్ప, శివశంకర్, ఆంజనేయులు, వెంకటేష్, రాజును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా గజ్జపతి మాట్లాడుతూ..11న చలో హైదారాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు వెంటనే చట్టబద్ధత కల్పించాలన్నారు.

నకిలీ విలేకరులపై చర్యలు తీసుకోవాలి

మాగనూర్: మండల కేంద్రానికి చెందిన కొందరు యువకులు ఎలక్ట్రానిక్ ప్రింట్‌మిడియా, పేర్లు చెప్పుకొని అక్రమ వసూలకు పాల్పడుతున్నట్లు మండల ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రానికి చెందిన నలుగురు యువకులు ఒక గ్యాంగ్‌గా ఏర్పడి చిరు వ్యాపారులు, పత్తివ్యాపారస్తుల వద్దకు వెళ్లి బెదిరింపులకు పాల్పడి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి వారిని గుర్తించి పోలీసు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

మద్దూరు: మంత్రి కేటీఆర్ నామినేషన్ సందర్భంగా కొడంగల్‌కు ఈ నెల 9న విచ్చేస్తున్నారు. ఆయన పర్యటనను కార్యకర్తలు కలిసి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయా మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు.. నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసినా మంత్రి కేటీఆర్ అని గుర్తుచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ డైరెక్టర్ సలీం, నాయకులు బాల్‌సింగ్‌నాయక్, వెంకటయ్య, జగదీశ్వర్, శివకుమార్, వీరారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాజు, వీరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

రైతులకు అనుకులంగా హైకోర్టు తీర్పు !

మరికల్: మండల కేంద్రంలోని సర్వే నంబర్ 449లో పట్టాకలిగి సాగు చేసుకుంటున్న రైతుల భూముల జోలికి అధికారులు వెళ్లొద్దని హైకోర్టు తీర్పు ఇచ్చినట్లు రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి గోపాల్, జిల్లా అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రభుత్వం లబ్ధిదారులకు ఇచ్చిన భూమిలో 50ఏళ్లుగా సాగు చేస్తున్న భూమిని ప్రభుత్వం బలవంతంగా లాక్కోవడం కోసం ఇంకా ప్రయాత్నాలు మానుకోవాలన్నారు. హైకోర్టు తీర్పును దిక్కరిస్తే రైతుల పక్షాన కేసులు నమోదు చేస్తామన్నారు.

దివ్యాంగులకు మేలు చేసే వారికే మద్దతు

కృష్ణా: దివ్యాంగుల మేలు కోసం కృషిచేస్తున్న ఆ పార్టీకి తమ మద్దతు ఉంటుందని నియోజకవర్గ నాయకుడు నాగేష్‌గౌడ్, శ్రీనివాసులుగౌడ్ ప్రకటించారు. మంగళవారం స్థానిక విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.. జాతీయ పార్టీలు అయిన బీజేపీ, కాంగ్రెస్ తమ సమస్యల గురించి వారి ప్రణాళికలో పొందుపర్చాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.



అద్దె భవనాలే దిక్కు..!

- సొంత భవనాలకు నోచుకోని కొత్త మండలాలు
- అసౌకర్యాల మధ్య ప్రజా సేవలు
- మరికల్ మండల సముదాయానికి రూ.7 కోట్లు
- పెండింగ్ బిల్లుల కారణంగా ముందుకు సాగని పనులు



పంచాయతీ భవనంలో మరికల్ తహసీల్దార్ కార్యాలయం

మరికల్: మరికల్: పరిపాలనా సౌలభ్యంతోపాటు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం జిల్లాలను పునర్విభజనతోపాటు కొత్త మండలాలను ఏర్పాటు చేసింది. ఇవి ఏర్పడి ఐదేళ్లు గడుస్తున్నా సౌకర్యాలు మాత్రం కల్పించలేదు. దీంతో కొత్త మండలాలు ఏర్పడినా ప్రజలకు సరైన సేవలు అందక ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. పేట జిల్లాలో ముందుగా ఐదేళ్ల కిందట మరికల్, కృష్ణా మండలాలు ఏర్పడగా.. ఇటీవల గుండుమాల్, కొత్తపల్లి మండలాలు ఏర్పాటు అయ్యాయి. అయితే గతంలో ఏర్పాటు చేసిన మండలాలకు, ఇటీవల ఏర్పాటు చేసిన వాటికి సొంత కార్యాలయాలు మంజూరు కాలేదు. దీంతో అరకొర వసతు లున్న అద్దె గదులు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో కొనసాగిస్తున్నారు.

కీలక శాఖలకు సైతం..

మండలంలో కీలకంగా వ్యవహరించే ప్రధాన కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. సిబ్బందిని సైతం పూర్తిస్థాయిలో నియామకం చేయలేదు. సంవత్సరాలు గడిచినా తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్ వంటి కీలక శాఖలకు సొంత భవనాలు లేవు. ఐదేళ్ల కిందట ఏర్పడిన మరికల్ మండలంలో ఎంపీడీఓ కార్యాలయం అద్దెభవనంలో, తహసీల్దార్ కార్యాలయం పంచాయతీ భవనంలో కొనసాగుతోంది. కృష్ణా మండలంలో ఆర్అండ్‌బీ అతిథిగృహంలో తహసీల్దార్, ఎమ్మార్సీ భవనంలో ఎంపీడీఓ కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల కొత్తగా ఏర్పడిన గుండుమాల్ మండల తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటుకు ప్రైవేట్ భవనాన్ని కేటాయించగా ఎంఈఓ కార్యాలయాన్ని పాఠశాల గదిలో, వ్యవసాయ కార్యాలయాన్ని రైతువేదికలో నెట్టుకొస్తున్నారు. కొత్తపల్లి మండలంలో ఎంపీడీఓ కార్యాలయం ఏర్పాటు చేయలేదు. తహసీల్దార్, ఎంఈఓ కార్యాలయాలు అద్దెభవనాల్లో ఏర్పాటు చేశారు. రెండు మండలాలకు పోలీస్‌స్టేషన్లు మంజూరు కాలేదు.

కొత్త మండలాలు ఇలా..

కొత్త మండలాలు	జనాభా	పంచాయితీలు
మరికల్	35,658	19
కృష్ణా	20,460	13
గుండుమాల్	20,459	11
కొత్తపల్లి	19,932	10

రూ.7 కోట్లు మంజూరు..

పేట నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడిన మరికల్ మండలంలో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల సమూదాయ నిర్మాణం కోసం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి రూ.7 కోట్లను మంజూరు చేయించారు. ఇందుకు గాను మరికల్‌కు 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో ఉన్న 5 ఎకరాల్లో మండల కాంప్లెక్స్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మక్తల్ నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడిన కృష్ణా మండలంలో మండల సముదాయం కోసం స్థల సేకరణ చేశారు. కానీ, అధికారులు ఓకే చేస్తే తప్ప నిధులు మంజూరయ్యే అవకాశం లేదు. ఇటీవల కొత్తగా ఏర్పడిన గుండుమాల్, కొత్తపల్లి మండలాల్లో అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు.



నిర్మాణంలో మరికల్ మండల కాంప్లెక్స్ భవన పనులు

కొత్త భవనాలకోసం ఉత్తర్వులు రావాలి

కొత్త మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంది. మరికల్ మండలానికి ఎమ్మెల్యే చొరవతో నిధులు మంజురైంది. కృష్ణా మండలంలో ఇటీవల స్థల సేకరణ చేశాం. ఫైనల్ చేయలేదు. ఇటీవల ఏర్పడిన గుండుమాల్, కొత్తపల్లి మండలాల్లో అద్దె భవనాల్లో కార్యాలయాలను కొనసాగిస్తున్నాం.

– రాంచందర్‌రావు, ఆర్డీఓ నారాయణపేట

పిల్లలను కూలీకి పంపించొద్దు

నర్వ: బడిఈడు పిల్లలు 6 నుంచి 14ఏళ్ల లోపు వారిని కూలీలకు పంపించకుండా పాఠశాలకు పంపించాలని డీఆర్పీలు నరేందర్, శ్రీకాంత్ అన్నారు. మంగళవారం పాథర్చేడ్, నర్వ ప్రాథమిక పాఠశాలలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ 2.0 అమలును విద్యార్థుల ద్వారా పరిశీలించారు. విద్యార్థుల్లో గణితం, మౌళికభాష కనీస సామర్థ్యాలను పరిశీలించారు. అభ్యాసన సామర్థ్యాల కోసమే ఎఫ్ఎల్ఎన్ 2.0 ఉందని తరగతి గదిలో తప్పకుండా టిఎల్ఎం సహాయంతో అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు బడిఈడు పిల్లలను పాఠశాలలకు పంపించాలన్నారు. ఈ క్యాక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు మల్లేష్, సూరం వెంకటేష్, డీఆర్పీ లక్ష్మణ్, ఉపాధ్యాయులు రాజేష్, హరిశంకర్, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఆర్పీ

పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం

మక్తల్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సభతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం వచ్చింది. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలపై తరలివచ్చారు. దీంతో పట్టణంలోని రహదారులు కిటకిటలాడాయి. ఇదిలా ఉండగా గొల్ల కురుమలు, కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డికి గొర్రె పిల్ల, గొంగడిని అందజేశారు. అనంతరం మక్తల్ మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, మరికొందరు రేవంత్ సమక్షంలో పార్టీలో చేరారు. మాజీ ఎంపీ మల్లు రవి, జెడ్పీ చైర్మన్ వనజమ్మ, ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ సీతా దయాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి, బీకేఆర్ ట్రస్ట్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి,పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..

నారాయణపేట రూరల్ : రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గిరిజనులకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ప్రచారం చేసి మాట్లాడారు.. కాంగ్రెస్ అందిస్తున్న ఎస్సీ, ఎస్టీ డిక్లరైజేషన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

మాగనూర్: మండల పరిధిలోని పర్మన్‌దొడ్డికి చెందిన దాదాపు 80మంది కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.

మరికల్: స్థానిక మాధవరం గ్రామానికి సుమారు వందమంది బీఆర్ఎస్ కార్యకర్తలు నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

నారాయణపేట రూరల్ : మండలంలోని మంగళవారం ఆయా గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ మేరకు.. నాయకులు నాగురావునామాజీ, గోవా వాస్కో అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే కృష్ణసాల్‌కర్‌తో కలిసి కార్యకర్తలు కరపత్రాలు పంపిణీ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు సత్యాయాదవ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.

మక్తల్/ఊట్కూర్: మక్తల్, ఊట్కూర్ మండలంలోని వివిధపార్టీల నుంచి కార్యకర్తలు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జలంధర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు.

చదువుతోపాటు క్రీడల్లో సత్తాచాటాలి



కీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈఓ రవీందర్

మహబూబ్‌నగర్ క్రీడలు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సత్తాచాటాలని జిల్లా విద్యాధికారి రవీందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో జలజం సత్యనారాయణ ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా కొనసాగుతోంది. మంగళవారం ఆయా క్రీడా జట్లను డీఈఓ పరిచయం చేసుకొని మాట్లాడుతూ క్రీడలతో మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉండవచ్చన్నారు. జిల్లా విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలని కోరారు. రెండో రోజు మ్యాచుల్లో అపెక్స్ స్కూల్ జట్టు 94 పరుగుల తేడాతో గొల్లపల్లి జెడ్పీహెచ్ఎస్ జట్టుపై, గీతశ్రీ జట్టు 9 పరుగుల తేడాతో కేశవరెడ్డి స్కూల్ జట్టుపై, ప్రభుత్వ ఉన్నత పాఠశాల న్యూటౌన్ జట్టు 16 పరుగుల తేడాతో రేయిన్‌బో స్కూల్ జట్టుపై, ఉదయ మెమోరియల్ జట్టు 7 వికెట్ల తేడాతో చైతన్య స్కూల్ జట్లపై విజయం సాధించాయి. అదే విధంగా వాకోవర్‌లో లుంబిని స్కూల్ గెలుపొందింది. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, పీఈటీలు వినోద్‌కుమార్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

బండి సంజయ్ సభను విజయవంతం చేద్దాం

నారాయణపేట రూరల్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ బుధవారం జిల్లాకేంద్రానికి వస్తున్నారని.. కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాసులు, ప్రధానకార్యదర్శి రఘురామయ్యగౌడ్ కోరారు. పట్టణంలో బీజేపీ అభ్యర్థి రతంగ్‌పాండురెడ్డి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొని ఆయనకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తారని, పళ్ల హనుమాన్ మందిర్ నుంచి సరాఫ్ బజార్, చౌక్‌సెంటర్, పాతబస్టాండ్, సత్యనారాయణచౌరస్తా వరకు రోడ్‌షో అనంతరం కార్నర్ మీటింగ్ ఉంటుందన్నారు. కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. మంగళవారం హెలిప్యాడ్ ఏర్పాటు పనులను పార్టీ రాష్ట్ర నాయకుడు నాగూరావునామాజీ పరిశీలించారు.

అధ్వానంగా ప్రాజెక్టు రహదారి



రోడ్డుపై ఏర్పడిన గుంత

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుపై గల బీటీ రహదారి అధ్వానంగా మారినా సంబంధిత ప్రాజెక్టు అధికారులు పట్టించుకోవట్లేదు. జూరాల ప్రాజెక్టు పై నుంచి జోగులాంబ గద్వాల జిల్లాకు రహదారి సౌకర్యం ఉండడంతో వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. ఈ క్రమంలో బీటీ రహదారి దెబ్బతిని గుంతలమయమవుతున్నా అధికారులు ఏమాత్రం స్పందించక పోవడంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఉమ్మడిజిల్లాకే వరప్రదా యిని అయిన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు రహదారికి మరమ్మతు చేయడంలో ప్రభు త్వం చొరవచూపక పోవడం శోచనీయం అని ప్రాజెక్టు సందర్శన కోసం వస్తున్న ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

ఘనంగా సీవీ రామన్ జయంతి

నారాయణపేట రూరల్: పట్టణంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో సీవీరామన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సీవీరామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ మేరకు.. డీఎస్ఓ భానుప్రకాష్ మాట్లాడుతూ.. కాంతి కిరణాలపై పరిశోధన చేసి సైన్స్ విభాగంలో ఇండియాకు నోబల్ బహుమతి సాధించిన ఘనత ఆయన సొంతమన్నారు. రామన్ ఎఫెక్ట్‌ను పరిచయం చేసిన గొప్ప శాస్త్రవేత్తగా అభివర్ణించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు కనకప్ప, రవికుమార్, సల్మాన్‌రాజ్, శివకుమార్, రాజేష్‌కుమార్, టీచర్లు మధుసూదన్, విజయ్, నిర్మల, శిరీష, సురేఖ, కృష్ణవేణి, మాణిక్యప్ప పాల్గొన్నారు.



జాజాపూర్‌లో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీచర్లు, విద్యార్థులు

తవ్వారు.. వదిలేశారు



కాల్వ నిర్మాణం కోసం తవ్విన గుంత

అమరచింత: పట్టణంలోని రెండో వార్డులో మదుగని విష్ణువర్ధన్ ఇంటి నుంచి మురుగుకాల్వ నిర్మాణం కోసం రహదారిని తవ్వారు. గుంత తవ్వి రెండు నెలల సమయం దాటినా ఇప్పటికీ నూతన డ్రెయినేజీ నిర్మాణ పనులు మొదలవ్వలేదు. వార్డు కౌన్సిలర్‌తో కలిసి కాలనీ ప్రజలు తమ వీధిలో మురుగుకాల్వ నిర్మించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్ ఖాజకు విన్నవించుకున్నారు. దీంతో కాలనీలో పూర్తిస్థాయిలో డ్రెయినేజీ నిర్మిస్తామని చెప్పారు. మొదటగా కాల్వ కోసం కాలనీ ప్రజలే గుంతలను తవ్వుకోవాలని మున్సిపల్ అధికారులు చెప్పటంతో వారు ఇంటింటికీ చందాలు వసూలు చేసి కాల్వ కోసం రహదారిని తవ్వారు. ఇప్పటికీ ఏడాది కాలం గడుస్తున్నా తమ సమస్యను పరిష్కరించలేక పోతున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. సైకిల్‌తో పాటు మోటార్ సైకిల్ సైతం వెళ్లలేని పరిస్థితులు దాపరించాయన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు

మహబూబ్‌నగర్ క్రీడలు: మహబూబాబాద్‌లో ఈనెల 10, 11 తేదీల్లో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి ఉషు (మార్షల్ ఆర్ట్స్) పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన డ్రాగన్ షోటోకాన్ కరాటే డూ స్పోర్ట్స్ విద్యార్థులు ఎంపికైనట్లు మహబూబ్‌నగర్ అర్బన్ అధ్యక్షుడు, కరాటే మాస్టర్ ఎస్‌కే.మోసీన్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికల్లో తమ షోటోకాన్ విద్యార్థులు అండర్–19 విభాగంలో అభిలాష్ (–56కేజీ), అండర్–17 విభాగంలో కె.రాకేశ్ (–45కేజీ), ఆయేషా తస్లిం (–52కేజీ), రుహయా బేగం (–56కేజీ) ఉన్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను మంగళవారం ఎంవీఎస్ డిగ్రీకళాశాల మైదానంలో విద్యార్థులను ఫౌండర్ సాలంబిన్ ఉమర్, చీఫ్ ఎగ్జామినర్, మాస్టర్లు ఫహీం, మోసీన్ అభినందించి సన్మానించారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

భరోసా కల్పించేందుకు పోలీసుల కవాతు

భూత్పూర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు భరోసా కల్పించే నేపథ్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం అడిషనల్ ఎస్పీ సురేష్, పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలతో మున్సిపాలిటీలోని ప్రధాన వీధులు, అమిస్తాపూర్‌తో పాటు మండలంలోని ఎల్కిచర్ల, మద్దిగట్ల, కొత్తమొల్గర గ్రామాల్లో కవాతు చేపట్టినట్లు వివరించారు. ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

ఉద్యోగుల శ్రేయస్సే ముఖ్యం



పరీక్షలు చేయించుకుంటున్న ఎస్ఈ శ్రీరాంమూర్తి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉద్యోగుల శ్రేయస్సే ముఖ్యమని ..వారు క్షేమంగా ఉంటేనే ప్రజలకు సేవలు చేయడానికి వీలుంటుందని ట్రాన్స్ కో ఎస్ఈ శ్రీరాంమూర్తి అన్నారు. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్‌భవన్‌లో మీటింగ్‌హాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. యశోద ఆస్పత్రి వారి సౌజన్యంతో 250 మంది ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్ష నిర్వహించారు. అవసరం ఉన్న వారికి మందులను అందజేశారు. ఏటా వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆస్పత్రి మేనేజర్ సాయికుమార్, డాక్టర్లు ప్రణీత, సీమంత, కల్యాణి, విద్యుత్‌శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

నారాయణపేట: స్థానిక బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మంగళవారం వివిధ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు.

మద్దూరు: బీఎస్పీ మండలాధ్యక్షురాలు కావలి రేణుక మంగళవారం ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే మద్దూరు వార్డు సభ్యురాలు ఎరుకలి వెంకటమ్మ చేరారు.

మరికల్: ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి గెలవాలని మంగళవారం బీఆర్ఎస్ మండల బీసీసెల్ అధ్యక్షుడు గాదం మల్లేష్ ఆధ్వర్యంలో పతేపూర్ మైసమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. మల్లేష్, రాంచందర్‌గౌడ్, ఆంజనేయులు, రాములు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

అడ్డాకుల: రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పెబ్బేర్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన కొందరు పాడిరైతులు వరి గడ్డి కోసం అడ్డాకుల మండలం పొన్నకల్‌కు ట్రాక్టర్‌లో వచ్చారు. గడ్డి వేసుకుని మంగళవారం ఉదయం రాంపూర్ వెళ్తుండగా కాటవరం శివారులో ట్రాక్టర్‌ను వెనుక నుంచి వచ్చిన కంటెయినర్ తగిలింది. దీంతో ట్రాక్టర్ ఇంజన్‌పై కూర్చున్న నానీ కిందపడ్డాడు. అతడికి కుడి కాలు తొడ భాగంలో ఫ్యాక్చర్ అయింది. బాధితుడిని ఎల్అండ్‌టీ అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

క్విజ్ పోటీలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక లక్ష్మీనగర్‌లోని సాయి మందిర్ లో మంగళవారం విద్యార్థులకు 'భారత్ కో జానో'పై భారత్ వికాస్ పరిషత్ (బీవీపీ) ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 15 పాఠశాలల నుంచి 60 మంది పాల్గొన్నారు. విజేతలకు దాతలు వి.సుదర్శన్ రూ.ఐదు వేలు, రాఘవరెడ్డి రూ.1,116 చొప్పున బహుమతి ప్రదానం చేశారు. ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమార్, బీవీపీ పాలమూరు శాఖ అధ్యక్షుడు పి.రమేష్‌చందర్, ఎస్.భూషణ్‌పాండే, నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మహబూబ్‌నగర్ క్రైం: ప్రభుత్వ మాడల్ బేసిక్ ఉన్నత పాఠశాల (1973–74) పూర్వ విద్యార్థుల సమ్మేళనం.. వారు చదువుకుని 50ఏళ్లు పూర్తి అయిన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.2.50లక్షలతో పాఠశాల చుట్టూ ప్రహరీ గ్రిల్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ముఖ్య అతిథిగా డీఈవో రవీందర్ హాజరై మాట్లాడారు. వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రకాష్, రాజసింహుడు, నర్సింహరావు, సత్యనారాయణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్వశక్తితో ఎదగాలి

నర్వ: బీసీ, ఎస్సీ, ఎస్టీలు స్వశక్తితో రాజకీయంగా ఎదగాలని డీఎస్పీ మక్తల్ ఎమ్మెల్యే అభ్యర్థి దశరథ్‌కుమార్ అడ్వకేట్ అన్నారు. మంగళవా రం పాథర్చేడ్‌లో ఆయన కార్యకర్తలతో కలిసి ఇంటింటి చేసి మాట్లాడారు.. డీఎస్పీ ఎన్నికల గుర్తు టార్చిలైట్‌పై వేసి గెలిపించాలని కోరారు. క్యాక్రమంలో డీఎస్పీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సురేష్, కృష్ణం, మన్యం, అరుణ్, అశోక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.